సాక్షి గుంటూరు

బుధవారం ♦ 17 ♦ జూలై ♦ 2024



ఎల్లమ్మతల్లి బోనాల ఉత్సవం

వెల్దుర్తి: గుండ్లపాడులో వేంచేసియున్న ఎల్లమ్మ తల్లికి మంగళవారం ఘనంగా బోనాలు సమర్పించారు. ప్రతి ఏడాది ఆషాఢమాసంలో బోనాలు సమర్పించటం ఆనవాయితీ



అమ్మవారికి ఆషాఢ సారె

నరసరావుపేట ఈస్ట్: పాతూరులోని గంగా పార్వతీ సమేత భీమలింగేశ్వరస్వామి ఆలయంలోని పార్వతీ అమ్మవారికి మహిళలు మంగళవారం ఆషాఢ సారె సమర్పించారు.



నేడు ఏకలవ్య జయంతి

చిలకలూరిపేట: పట్టణంలో బుధవారం జరగనున్న ఏకలవ్య జయంతిని విజయవంతం చేయాలని ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు బి.శ్రీనునాయక్ కోరారు.

న్యూస్‌రీల్

నేడు సాగర్ కుడి కాలువకు నీటి విడుదల

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడికాలువకు బుధవారం తాగునీటి అవసరాల నిమిత్తం ఉదయం 10 గంటలకు నీటిని విడుదల చేయనున్నట్లు మాచర్ల ఓఅండ్ఎం ఈఈ శ్రీహరి మంగళవారం తెలిపారు. కుడికాలువ పరిధిలోని గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు ఈ నీటి విడుదల కొనసాగుతుందన్నారు. కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ ఆదేశాల మేరకు మొత్తం 4.5టీఎంసీల నీరు రోజుకు 5,500 క్యూసెక్కుల చొప్పున 9 రోజుల పాటు విడుదల చేయనున్నట్లు ఈఈ తెలిపారు.

తెనాలి జిల్లా వైద్యశాలలో ఎన్‌హెచ్‌ఎం బృందం పరిశీలన



తెనాలి అర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలను నేషనల్ హెల్త్ మిషన్ ప్రతినిధి బృందం మంగళవారం పరిశీలించింది. ఇద్దరు ఐఏఎస్ అధికారులతోపాటు 15 మంది సభ్యులతో కూడిన బృందం జిల్లా వైద్యశాల ఆవరణలోని తల్లీ పిల్లల వైద్యశాలను సందర్శించింది. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న సేవలపై సభ్యులు ఆరా తీశారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం జిల్లా వైద్యశాలలోని ఐపీహెచ్‌ఎల్ ల్యాబ్, స్టేమి ప్రోగ్రామ్, డైక్ సెంటర్, ఆబా కార్యక్రమాల పనితీరును పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి అనురాధ పట్నాయక్ ఆధ్వర్యంలోని మరో బృందం తల్లీపిల్లల వైద్యశాలను పరిశీలించింది. అక్కడ అందిస్తున్న సేవలపై ఆరాతీసి వైద్యులకు పలు సూచనలు చేసింది. కార్యక్రమంలో జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ సుబ్రమణ్య రాజు, వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి, ఏవో డాక్టర్ మజీద బేగం, పలువురు వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం సక్రమంగా అందించాలి

సమగ్ర శిక్ష ఏపీసీ విజయలక్ష్మి



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని పరిశుభ్రంగా, సక్రమంగా అందించాలని సమగ్ర శిక్ష ఏపీసీ జి.విజయలక్ష్మి పేర్కొన్నారు. మార్కెట్ సెంటర్లోని హిందూ కాలేజీ హైస్కూల్‌ను మంగళవారం తనిఖీ చేసిన ఆమె మధ్యాహ్న భోజన అమలు తీరుతెన్నులను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి ఆహార పదార్థాలను రుచిచూశారు. రోజూ పాఠశాలలోనే మధ్యాహ్న భోజనాన్ని పరిశుభ్రమైన వాతావరణంలో తయారు చేయాలని ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. నాణ్యత విషయంలో రాజీ పడకుండా, మెనూ కచ్చితంగా పాటించాలని సూచించారు. విద్యార్థులందరూ మధ్యాహ్న భోజనం ఆరగించేలా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావుకు సూచించారు. ఆమె వెంట డీవైఈఓ పి.వెంకటేశ్వరరావు, తూర్పు ఎంఈఓ–2 నాగేంద్రమ్మ, ఏఎస్‌వో జయశంకర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

స్థానిక సంస్థలను ఆర్థికంగా బలోపేతం చేయాలి

ఐదో ఆర్థిక సంఘం చైర్‌పర్సన్ ప్రొఫెసర్ రత్నకుమారి



గుంటూరు వెస్ట్ : స్థానిక సంస్థలను ఆర్థికంగా బలోపేతం చేసుకోవడానికి కావాల్సిన అన్ని చర్యలూ చేపట్టాలని 5వ రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్‌పర్సన్ ప్రొఫెసర్ రత్నకుమారి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారులు, స్థానికసంస్థల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందాల్సిన నిధులతోపాటు స్థానికంగా మెరుగు పరచుకోవాల్సిన అంశాలపైనా దృష్టి సారించాలని పేర్కొన్నారు. అనంతరం ప్రభుత్వాల నుంచి అందాల్సిన సహాయ సహకారాల గురించి కమిటీ సభ్యులతో చర్చించారు. సమావేశంలో డీపీఓ శ్రీదేవి, కమిషన్ మెంబర్ సెక్రటరీ డాక్టర్ కేవీ రమణారెడ్డి, సభ్యులు కృష్ణారావు, ఎంపీఎస్ పద్మారావు, జెడ్పీ డెప్యూటీ సీఈఓ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

కంటిపాపలపై కర్కశం



‘మగపు’టేనుగుల మృగవాంఛలకు కంటిపాపలు బలవుతున్నాయి. ముద్దునవ్వులొలికే ముక్కుపచ్చలారని చిన్నారులను కామ నాగులు కాటేస్తున్నాయి. అభంశుభం తెలీని బాలికలపై జరుగుతున్న వరుస అకృత్యాలు వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి. జిల్లాలో రెండురోజుల వ్యవధిలో వెలుగు చూసిన మూడు ఘటనలు కన్నవారి గుండెల్లో పెనువిషాదం నింపాయి. సభ్యసమాజాన్ని కంటతడి పెట్టించాయి.

- బాలికలపై ఆగని అకృత్యాలు
- కొత్తరెడ్డిపాలెంలో చిన్నారి అనుమానాస్పద మృతి
- జిల్లావ్యాప్తంగా వెల్లువెత్తుతున్న జనాగ్రహం
- నడింపాలెంలో విద్యార్థినిపై ఆటోడ్రైవర్ లైంగిక దాడి
- ఫిరంగిపురం మండలంలో వేధింపులకు బాలిక బలి

చేబ్రోలు: చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామంలో సోమవారం దళిత విద్యార్థిని అనుమానాస్పదస్థితిలో మరణించిన ఘటన సంచలనం సృష్టించింది. బాలిక మృతదేహాన్ని మంగళవారం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. బాలిక మృతిపై జిల్లావ్యాప్తంగా జనాగ్రహం పెల్లుబికింది. నిందితుడిని తక్షణం అరెస్టు చేయాలని దళిత, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి.

అసలేం జరిగిందంటే..

కొత్తరెడ్డిపాలెం దళితవాడకు చెందిన పేరుపోగు శైలజ (13) కేసీ ప్రాథమిక పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. సోమవారం ఉదయం ఇంటి వద్ద నుంచి పాఠశాలకు వెళ్లిన ఆమెకు గ్యాస్ డెలివరీ బాయ్ నాగరాజు మాయమాటలు చెప్పి షాపు వద్దకు తీసుకువెళ్లి కూల్‌డ్రింక్ ఇప్పించి తర్వాత తన ఇంటికి తీసుకువెళ్లాడు. ఆ తర్వాత నాగరాజు ఇంటికి తాళం వేసి పరారయ్యాడు. బాలిక స్కూల్‌కు వెళ్లిందని కుటుంబ సభ్యులు భావించారు. సోమవారం సాయంత్రం శైలజ కోసం గాలించిన కుటుంబ సభ్యులు నాగరాజు ఇంటిలో విగతజీవిగా పడి ఉండడం గుర్తించి కన్నీరుమున్నీరయ్యారు. బాలిక మృతి ఘటనపై తెనాలి డీఎస్పీ ఎం.రమేష్, పొన్నూరు రూరల్ సీఐ వై.కోటేశ్వరరావు, చేబ్రోలు ఎస్ఐ పి.మహేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గుంటూరు నుంచి వచ్చిన క్లూస్ టీం ఆధారాలు సేకరించింది.

నాగరాజు గతం నేరచరిత్రే

బాలిక మృతి ఘటనలో నిందితుడిగా అనుమానిస్తున్న నాగరాజుకు గతంలో నేరచరిత్ర ఉన్నట్టు తెలుసుకుని గ్రామస్తులు నివ్వెరపోతున్నారు. కృష్ణా జిల్లా కొండపల్లికి చెందిన నాగరాజుకు భార్య, పిల్లలు ఉన్నారు. కొండపల్లిలో మరో మహిళతో సన్నిహితంగా ఉండేవాడు. వివాదం రావటంతో ఆమెను హత్యచేసి అదృశ్యమయ్యాడు. కృష్ణా జిల్లాలో ఇతనిపై మరో హత్యాయత్నం, యాక్సిడెంట్ కేసులు ఉన్నట్టు సమాచారం. అనంతరం కరోనా సమయంలో చేబ్రోలుకు చేరుకున్న నాగరాజు హోటల్ కార్మికుడిగా చేరాడు. అనంతరం గ్యాస్ కంపెనీలో పనిచేసే శ్రీనివాసరెడ్డి పరిచయం కావడంతో గ్యాస్ కంపెనీలో రోజువారీ కూలీగా చేరాడు. కొత్తరెడ్డిపాలెంలో ఉన్న తన ఇంటిని నాగరాజుకు శ్రీనివాసరెడ్డి అద్దెకు ఇచ్చాడు. మూడేళ్లుగా అక్కడే ఉంటున్న నాగరాజు అందరితో మంచిగా నమ్మకంగా ఉన్నాడు.





చేబ్రోలులోని పాతపోలీసు స్టేషన్ సెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న దళిత, విద్యార్థి సంఘాల నేతలు (ఇన్‌సెట్‌లో) శైలజ (ఫైల్)

నిందితుడి ఆచూకీ కోసం ఐదు ప్రత్యేక బృందాలు

నాగరాజు ఆచూకీ కోసం తెనాలి డీఎస్పీ రమేష్ పర్యవేక్షణలో ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. పొన్నూరు రూరల్ సీఐ వై.కోటేశ్వరరావు, చేబ్రోలు ఎస్ఐ పి.మహేష్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే నాగరాజుతో సన్నిహితంగా ఉండే కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు. గ్రామంలోని పలు సీసీ కెమెరాలను పరిశీలిస్తే ఇంటికి తాళం వేసిన తర్వాత నాగరాజు ఆటోలో సెంటర్‌కు వచ్చినట్టు, చేబ్రోలు ప్రధాన సెంటర్‌లోని సెల్ ఫోన్ షాపులో ఫోన్ తాకట్టు పెట్టి కొంత నగదును తీసుకొని బస్సు ఎక్కి వెళ్లిపోయినట్టు తెలిసింది. దీంతో కొండపల్లిలో ఉన్న నాగరాజు భార్యతోపాటు, వారి కుటుంబ సభ్యులను పోలీసులు విచారణ చేస్తున్నారు.

విద్యార్థి, దళిత సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో

నాగరాజును తక్షణం అరెస్టు చేయాలని విద్యార్థి, దళిత సంఘాల ఆధ్వర్యంలో చేబ్రోలు పాతపోలీసు స్టేషన్ సెంటర్‌లో మంగళవారం సాయంత్రం రాస్తారోకో నిర్వహించారు. కొత్తరెడ్డిపాలెం నుంచి చేబ్రోలు మెయిన్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం జీబీసీ రోడ్డుపై విద్యార్థులు, దళిత సంఘాల నాయకులు, మహిళలు, యువకులు బైఠాయించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సుభాష్, నాయకులు ఎన్.భాను వెంకట సాయి, వై.శశికాంత్, మణికంఠ, శ్యామ్ జగదీష్, ధనుష్, ధనుంజయ్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): శైలజ మృతి కేసులో నిందితుడిని తక్షణం అరెస్టు చేయాలని, కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. స్థానిక గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి వద్ద బాధిత కుటుంబ సభ్యులను సీపీఎం నాయకులు కలిసి పరామర్శించి ధైర్యం చెప్పారు.

కలచి వేసిన మరో రెండు ఘటనలు

మంగళవారం వెలుగుచూసిన మరో రెండు ఘటనలు గుండెలను పిండేశాయి. ప్రత్తిపాడు మండలం చినకోండ్రుపాడు గ్రామానికి చెందిన 13 ఏళ్ల బాలికపై ఈనెల 12న ఆటో డ్రైవర్ అత్యంత పాశవికంగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన బాలిక తల్లిదండ్రులకు తీరని వేదన మిగిల్చింది.

- ప్రేమపేరుతో యువకుడి వేధింపులను తాళలేక ఫిరంగిపురం మండలంలో ఓ బాలిక ఆత్మహత్యకు యత్నించి ఆదివారం అర్ధరాత్రి చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచింది. ఈ రెండు ఘటనలపై మంగళవారం పోలీసులు కేసులు నమోదు చేశారు.

కేసీ హైస్కూల్‌ను తనిఖీ చేసిన జిల్లా విద్యాశాఖాధికారి

చేబ్రోలు: చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామంలోని కొండవీటి కమిటీ ఉన్నత పాఠశాల (కేసీ హైస్కూల్)ను డీఈఓ శైలజ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 7వ తరగతి విద్యార్థిని శైలజ సోమవారం అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన విషయం తెలిసిందే. దీనిపై బడికి వెళ్లి వస్తూ మృతి చెందినట్లు కథనాలు రావటంతో డీఈఓ తనిఖీలు చేసినట్లు తెలిసింది. విద్యార్థిని శైలజ సోమవారం పాఠశాలకు రాలేదని ఉపాధ్యాయులు తెలిపారు. హాజరు పట్టిక, ఆన్‌లైన్ హాజరును డీఈఓకు చూపారు.



కొత్తరెడ్డిపాలెం కేసీ హైస్కూల్ ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈఓ శైలజ



శైలజ మృతదేహం వద్ద విలపిస్తున్న తండ్రి దానియేలు

పెదరావూరు శివాలయంలో చోరీ

- అమ్మవారి ఆభరణాలు అపహరించిన దుండగులు
- నగల విలువ రూ.రెండు లక్షలు
- మరో రూ.10 లక్షల విలువైన స్వామి నగల చోరీకీ యత్నం
- మోయలేక ఆలయ ఆవరణలోనే వదిలిన వైనం



ఆభరణాలు చోరీకి గురైన అమ్మవారి విగ్రహం



దుండగులు విరగ్గొట్టిన గర్భగుడి గడి

తెనాలిరూరల్: పెదరావూరులోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో భారీ చోరీ జరిగింది. సోమవారం అర్ధరాత్రి దాటాక ఆలయంలోకి చొరబడిన దుండగులు గర్భాలయ తాళాలు, గడి పగలగొట్టి విలువైన ఆభరణాలను చోరీ చేశారు. అమ్మవారి విగ్రహంపై ఉన్న నాలుగు బంగారు అభయహస్తాలు, పాదాలు, బంగారు కళ్లు, మంగళ సూత్రాలు, బొట్టు అపహరించుకు వెళ్లారు. అనంతరం గర్భాలయంలో మల్లేశ్వర స్వామి నాగాభరణాలు, పానపట్టం వంటి సుమారు రూ.పది లక్షల విలువ చేసే వెండి ఆభరణాల అపహరణకు యత్నించారు. వాటిని మోయలేక ఆలయ ఆవరణలోనే వదిలేసి వెళ్లారు. అమ్మవారి విగ్రహంపై ఉన్న సుమారు రూ.రెండు లక్షల విలువైన ఆభరణాలు అపహరించుకు వెళ్లారు. దుండగులు సీసీ కెమెరా వైర్లు కత్తిరించి హార్డ్ డిస్క్‌ను కూడా ఎత్తుకెళ్లారు. పెదరావూరులో ప్రసిద్ధి చెందిన ఈ ఆలయంలో చోరీ జరగడం ఇది మూడోసారి. దీంతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని స్థానికులు కోరుతున్నారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. రూరల్ ఎస్ఐ పి.కోటేశ్వరరావు ఆలయాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుంటూరు రేంజ్‌లో పది మంది సీఐలు బదిలీ

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు రేంజ్ పరిధిలో పది మంది సీఐలను బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.

సీఐ పేరు	ప్రస్తుతం	బదిలీ
ఎం.విజయచరణ్	సోషల్ మీడియా, సైబర్ క్రైం సెల్, పల్నాడు	నరసరావుపేట 1 టౌన్ పీఎస్
సిరిగిరి సాంబశివరావు	వినుకొండ టౌన్ పీఎస్	నరసరావుపేట 2 టౌన్ పీఎస్, పల్నాడు
యు.శోభన్‌బాబు	డీఎస్‌బీ-2, పల్నాడు జిల్లా	వినుకొండ టౌన్ పీఎస్, పల్నాడు జిల్లా
పసుపులేటి రామకృష్ణ	వేమూరు సర్కిల్, బాపట్ల	నరసరావుపేట రూరల్ సర్కిల్, పల్నాడు జిల్లా
బలగాని ప్రభాకర్	తుళ్లూరు ట్రాఫిక్-2, గుంటూరు	వినుకొండ రూరల్ సర్కిల్, పల్నాడు జిల్లా
బి.సుబ్బనాయుడు	ఎస్సీ, ఎస్టీ సెల్, పల్నాడు	చిలకలూరిపేట రూరల్ సర్కిల్, పల్నాడు జిల్లా
కె.వెంకటప్రసాద్	డీఎస్‌బీ-3, గుంటూరు	అచ్చంపేట యూపీఎస్, పల్నాడు జిల్లా
ప్రత్తిపాటి సురేష్	రేంజ్ వీఆర్, గుంటూరు	పెదకూరపాడు సర్కిల్, పల్నాడు జిల్లా
ఎం.సుబ్రమణ్యం	రాపూర్ సర్కిల్, నెల్లూరు	సత్తెనపల్లి టౌన్ పీఎస్, పల్నాడు జిల్లా
పోలూరి శ్రీనివాస్	సత్తెనపల్లి టౌన్ పీఎస్, పల్నాడు జిల్లా	సత్తెనపల్లి రూరల్ పీఎస్, పల్నాడు జిల్లా

హాస్టల్ విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

- అధికారులకు కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశం
- తాడికొండ గురుకులం, బీసీ బాలికల వసతి గృహం తనిఖీ

తాడికొండ: సాంఘిక సంక్షేమ వసతి గృహాలలోని విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా తీర్చిదిద్దాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. మంగళవారం తాడికొండలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, బీసీ–ఈ బాలికల వసతి గృహాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో పరిసరాలు, తరగతి గదులు, వంటగది, డైనింగ్ హాల్‌ను పరిశీలించి సూచనలు చేశారు. విద్యార్థులకు అల్పాహారం, భోజనం మెనూ ప్రకారం అందించాలన్నారు. విద్యాబోధనపై ఉపాధ్యాయులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ప్రశ్నలు సంధించి సామర్థ్యాలను తెలుసుకున్నారు. గురుకుల పాఠశాల ప్రాంగణంలో నిల్వ ఉన్న వర్షపు నీటిలో దోమలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరిసరాల పరిశుభ్రతపై దృష్టిపెట్టాలన్నారు. విద్యార్థులు బస చేసే గదులు, మరుగుదొడ్లు పరిశీలించారు. కిటికీలకు వెంటనే మెష్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం బీసీ బాలికల వసతి గృహంలోని విద్యార్థులతో మాట్లాడి బోధనా సామర్థ్యాలను పరిశీలించారు. వంటగదిలో పరిశుభ్రత పాటించాలని ఆదేశించారు. బయటకు నీరు వెళ్లే డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేదని కలెక్టర్ దృష్టికి విద్యార్థులు తీసుకు రాగా చర్యలు తీసుకోవాలని ఈవోపీఆర్డీ వెంకటేశ్వర్లు, కార్యదర్శి పి.శ్రీనివాసులురెడ్డికి కలెక్టర్ సూచించారు. తనిఖీలలో డెప్యూటీ కలెక్టర్ గంగరాజు, ఆర్డీఓ పి.శ్రీకర్, సాంఘిక సంక్షేమ ఉప సంచాలకులు మధుసూధన్, తహసీల్దార్ మధుసూదనరావు, మండల ప్రత్యేకాధికారి పరిశ్రమల శాఖ ఉప సంచాలకులు సుధాకర్, గురుకుల పాఠశాలల జిల్లా కో–ఆర్డినేటర్ కె.పద్మజ, సమగ్ర శిక్ష అడిషనల్ కో–ఆర్డినేటర్ జి.విజయలక్ష్మి, ఎంఈఓ ఇందిర, పీహెచ్‌సీ డాక్టర్ ప్రతిమ పాల్గొన్నారు.



సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

మున్నంగిలో ఉచితానికి చెల్లు

- స్టాక్ పాయింట్లలో అదనపు వసూళ్లు
- నిబంధనలను ఉల్లంఘించి లారీకి రూ.2 వేలు

తెనాలి: స్టాక్ పాయింట్లలో నిల్వ చేసిన ఇసుక సరఫరాలో సిబ్బంది చేతివాటం చూపిస్తున్నారు. ఆరంభంలో నిబంధనల ప్రకారం ఇసుక కేటాయింపులు చేసిన సిబ్బంది, ఇప్పుడు అనధికారంగా లారీకి రూ.2 వేల వంతున డబ్బులు వసూలు చేస్తున్నారు. సిబ్బంది, పొక్లెయిన్ డ్రైవర్ మిలాఖత్ అయి వసూళ్ల పర్వానికి తెరతీశారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం తమకు తెలియదు అంటున్నారు.

ప్రస్తుత వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గత ప్రభుత్వం ఇసుక రీచ్‌ల్లో నుంచి ఇసుకను సేకరించి స్టాక్ పాయింట్లలో నిల్వ చేసిన విషయం తెలిసిందే. తెనాలి నియోజకవర్గంలో కొల్లిపర, మున్నంగిలో రెండు స్టాక్ పాయింట్లలో ఇసుకను నిల్వచేశారు. కొల్లిపరలో 33,388.50 మెట్రిక్ టన్నుల ఇసుక ఉండగా, అదే మండలంలోని మున్నంగి గ్రామంలోని స్టాక్ పాయింట్‌లో 1,81,303.50 మెట్రిక్ టన్నుల ఇసుకను నిల్వచేశారు. సార్వత్రిక ఎన్నికల తర్వాత రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇసుక విధాన రూపకల్పన ఇంకా చేయలేదు. ఈలోగా ప్రజల అవసరాల కోసం స్టాక్ పాయింట్లలో ఇసుకను ఉచితంగా ఇస్తామని ప్రకటించింది. ఆ ప్రకారం రూపొందించిన నిబంధనల ప్రకారం ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న ప్రజలకు స్టాక్ పాయింట్ల దగ్గర టన్ను రూ.250 చొప్పున గరిష్టంగా 20 టన్నుల వంతున కేటాయిస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. ఆ ప్రకారం ఒక్కో లారీకి రూ.5,000 చొప్పున తీసుకుంటున్నారు. రవాణా చార్జీలతో అధికారులకు పనిలేదు. ఎవరు తెచ్చుకున్న వాహనానికి వారు మాట్లాడుకున్న ప్రకారం చెల్లిస్తే సరిపోతుంది. రాష్ట్రంలో పలుచోట్ల ఇసుక స్టాక్‌పాయింట్లలో అదనపు రేట్లను బోర్డు పెట్టి మరీ విక్రయిస్తున్నట్టు వార్తలొచ్చాయి. అయినప్పటికీ తెనాలి నియోజకవర్గంలో ఉచితం అన్నప్పటికీ నిబంధనల ప్రకారమే టన్ను రూ.250లకు ఇసుక సరఫరా చేస్తున్నారని ప్రజలు సంతోషించారు. అది కూడా మూన్నాళ్ల ముచ్చటే అయింది. వర్షాల కారణంగా రెండురోజులుగా ఇసుక సరఫరా నిలిపివేశారు. తిరిగి మంగళవారం ఆరంభించారు. రెండురోజులుగా వచ్చిన వందలాది లారీలు వేచి ఉన్నాయి. దీనిని అవకాశంగా తీసుకుని సిబ్బంది అమ్మకాలకు తెరతీశారు. లారీకి ఒక్కో దానికి రూ.2,000 చొప్పున వసూలు చేశారు. అలా ఇచ్చిన లారీలనే వరుసలో ముందు పంపించి లోడుచేశారు. మరికొందరికి గరిష్ఠ సరఫరా 20 టన్నులకు మించి అదనంగా లోడుచేసి వారినుంచి రూ.2,000 దండుకున్నారు. ఇసుక పంపిణీని సాయంత్రం ఆరు గంటలకు నిలిపివేయాల్సి ఉండగా, ఆ తర్వాత కూడా వాహనాల్లో లోడుచేస్తూ కనిపించారు. అదేమని అడిగితే అక్కడ సిబ్బంది రూ.1,500, ఇసుక లోడు చేసే పొక్లెయిన్ డ్రైవర్ రూ.500 చొప్పున తీసుకుంటున్నట్టు బాహాటంగానే చెప్పటం గమనార్హం!



సాయంత్రం 6.30 గంటల సమయంలో వాహనాల్లో ఇసుక లోడింగ్ చేస్తున్న దృశ్యం

నా దృష్టికి రాలేదు.. విచారణ చేస్తా

ఇసుక పంపిణీకి ప్రభుత్వ ఎంబ్లమ్‌తోనే టోకెన్లను డిపార్టుమెంటు ద్వారానే పంపిణీ చేశాం. ఈ రోజు నేను లేను. గుంటూరులో మీటింగ్‌కు అటెండవ్వాల్సి వచ్చింది. రెండు రోజుల్నుంచి మేం ఇవ్వలేదు. అధిక ధరల వసూలు నా దృష్టికి రాలేదు. విచారణ చేసి నిజమని తేలితే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

– విష్ణుప్రసాద్, ఎంపీడీఓ, కొల్లిపర

నిజమైతే చర్యలు తీసుకుంటాం

ఇసుక పంపిణీలో అదనపు వసూళ్లకు ఆస్కారం లేదు. ఎక్కడైనా ఒకటీ అరా జరిగాయేమో తెలీదు. మా దృష్టికి మాత్రం రాలేదు. దీనిపై బుధవారం ఉదయాన్నే విచారణ చేస్తాం. రుజువైతే తగిన చర్యలు తీసుకుంటాం.

– ఎస్.శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్, తెనాలి

క్లుప్తంగా

జిల్లాలో సాధారణ వర్షపాతం 11.1మి.మీటర్లు

అత్యధికంగా మేడికొండూరులో 20.2 మి.మీ

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో సోమవారం నుంచి మంగళవారం ఉదయం వరకు సగటున 11.1 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా మేడికొండూరు మండలంలో 20.2 మిల్లీమీటర్ల వర్షం కురవగా, అత్యల్పంగా పెదనందిపాడు మండలంలో 1.6 వర్షం కురిసింది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. తాడికొండ మండలంలో 18.4 మి.మీ., గుంటూరు తూర్పు 16.2, కొల్లిపర 15.2, గుంటూరు పశ్చిమ 15, చేబ్రోలు 14.8, తుళ్లూరు 14.4, మంగళగిరి 13, ఫిరంగిపురం 11.2, పెదనందిపాడు 10.8, ప్రత్తిపాడు 9.4, వట్టిచెరుకూరు 8.8, దుగ్గిరాల 8.6, పొన్నూరు 7.8, తాడేపల్లి 6.4, తెనాలి 5.2, కాకుమాను మండలంలో 3.6 మి.మీ చొప్పున వర్షం కురిసింది.

20న దివ్యాంగులకు మెగా జాబ్‌మేళా

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా ఉపాధి కార్యాలయం, సమర్థనం సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 20న దివ్యాంగుల కోసం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.రఘు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గోరంట్లలోని హోసన్నా మందిర్ ఎదుట సమర్థనం సంస్థలో ఉదయం 9.30 గంటల నుంచి జరగనున్న మెగా జాబ్‌మేళాకు టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్హతలు కలిగిన 18 నుంచి 35 ఏళ్ల లోపు యువత హాజరు కావాలని సూచించారు. నాలుగు ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్న జాబ్‌మేళాలో అభ్యర్థుల అర్హతలు ఆధారంగా ఉద్యోగాలు కల్పిస్తామని, విద్యార్హతల రెజ్యూమ్, ఆధార్ కార్డు జిరాక్స్, విద్యార్హతల ధ్రువపత్రాలు తీసుకుని రావాలని సూచించారు. వివరాలకు 63648 67800, 63648 67801, 63648 67802 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

కారు ఢీకొని యువకుడు మృతి



మేడికొండూరు: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన మేడికొండూరు మండలం పేరేచర్ల యూనివర్సల్ కాలేజీ సమీపంలో మంగళవారం జరిగింది. మేడికొండూరు సీఐ దార్ల జయకుమార్ కథనం ప్రకారం.. అమరావతి మండలం పొందుగల గ్రామానికి చెందిన ఆరెకట్ల శివనాగేశ్వరరావు(26) ఉద్యోగ అవకాశాల నిమిత్తం ద్విచక్ర వాహనంపై మార్కాపురం బయలుదేరాడు. మార్గమధ్యలో పేరేచర్ల యూనివర్సల్ కళాశాల సమీపంలో అతివేగంగా నరసరావుపేట నుంచి పేరేచర్ల వైపు వస్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఘటనా స్థలంలోనే శివనాగేశ్వరరావు మృతి చెందాడు. ఘటన గురించి మృతుని బంధువులకు తెలిపిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసి మేడికొండూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కారుణ్యమూర్తి కార్మెల్‌మాత



కార్మెల్ కొండపై మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



కార్మెల్‌మాత స్వరూపంతో ప్రదక్షిణ చేస్తున్న గురువులు

ఫిరంగిపురం: కారుణ్యమూర్తి కార్మెల్‌మాత అని పలువురు గురువులు చెప్పారు. కార్మెల్ కొండపై జరుగుతున్న ఉత్సవాలు మంగళవారం మూడో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా జరిగిన సమష్టి దివ్యపూజాబలి కార్యక్రమంలో ప్రధాన యాజకుడు, నూతన అభిషిక్త గురువు కె.శౌరినిఖిల్ తేజ, గురువులు ప్రవీణ్‌కుమార్, చొప్పర కిషోర్‌బాబు పాల్గొన్నారు. కార్మెల్ మాత అవతరణ విశేషాలను వివరించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తేరుపై కార్మెల్ మాత స్వరూపాన్ని ఉంచి గుడి చుట్టూ ప్రదక్షిణ చేశారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దివ్యపూజాబలిలో పాల్గొన్నారు. అనంతరం కొండపై తలనీలాలు సమర్పించారు. కొబ్బరికాయలు కొట్టి, కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మూడురోజులుగా ఏడుగురు సిబ్బంది ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. అవసరమైన వారికి పరీక్షలు చేసి మందులు అందించారు. బాల ఏసు దేవాలయం సమీపంలోని పునీత అంథోని వారి ఆలయంలో భక్తులు పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఆలయ నిర్వాహకుడు మున్నంగి జోజప్ప ప్రసాదాలు అందజేశారు.

ఓపీఎస్ అమలుచేయాలంటూ ప్రదర్శన



ఆందోళన నిర్వహిస్తున్న యూనియన్ నేతలు

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల ఆవరణంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా కార్యాలయంలో ఓపీఎస్ కావాలని కోరుతూ మంగళవారం ఆందోళన నిర్వహించారు. జీపీఎస్ యాక్ట్‌ను తాత్కాలికంగా నిలిపివేసినందుకు ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా నేతలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు చాంద్ బాషా మాట్లాడుతూ జీపీఎస్ యాక్ట్‌ను వెనక్కి తీసుకోవటం వల్ల రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు చాలా మేలు చేసిందన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు అందరూ ఓపీఎస్ పాత పెన్షన్ విధానం కావాలని కోరుకుంటున్నారని చెప్పారు. సీపీఎస్, జీపీఎస్‌లకు ప్రభుత్వ ఉద్యోగులు అంగీకరించే పరిస్థితుల్లో లేరని పేర్కొన్నారు. గత దశాబ్దకాలం నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు సీపీఎస్ శాపంగా మారిందని వెల్లడించారు. ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేసి తీరాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి శివారెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కరిముల్లా షాఖాదరి, జిల్లా కోశాధికారి పోతురాజు, నగర శాఖ అధ్యక్షుడు నాగేశ్వరరావు, పెద రత్తయ్య, మహిళా విభాగం జిల్లా కార్యదర్శి సుమిత్రాదేవి, సహా అధ్యక్షురాలు హేమలత రోజా, శేషుకుమారి తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు జిల్లాపై వెస్ట్ గోదావరి ఆధిక్యం



6 వికెట్లు తీసిన వెస్ట్ గోదావరి బౌలర్ సాయిరామ్ చరణ్ రాజు



6.4 ఓవర్లలో 4 వికెట్లు తీసిన సురేష్

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నవులూరు అమరావతి టౌన్‌షిప్‌లో గల ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న అండర్ -16 మల్టీ డే ఇంటర్ జోనల్ పోటీల్లో భాగంగా మంగళవారం వెస్ట్ గోదావరి, కర్నూలు జట్ల మధ్య మ్యాచ్ నిర్వహించారు. టాస్ గెలిచిన వెస్ట్ గోదావరి జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా, బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 47.4 ఓవర్లలో 141 పరుగులకు ఆల్ ఔట్ అయ్యింది. వెస్ట్ గోదావరి బౌలర్ సాయిరామ్‌చరణ్ రాజు చెలరేగిపోయి 20 ఓవర్లలో 48 పరుగులు ఇచ్చి ఆరు వికెట్లు తీసుకున్నాడు. మరో బౌలర్ సురేష్ 6.4 ఓవర్లలో 17 పరుగులు మాత్రమే ఇచ్చి నాలుగు వికెట్లు తీసి కర్నూలు జట్టును అదుపుచేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన వెస్ట్ గోదావరి జట్టు 35 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 59 పరుగులు మాత్రమే చేసింది. మూడవ రోజు వెస్ట్ గోదావరి జట్టు కర్నూలు జట్టుపై 82 పరుగులు వెనుకబడి ఉంది.

కేవీకే గోల్డెన్ జూబ్లీ వేడుకలు ప్రారంభం



వేడుకల్లో పాల్గొన్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, రైతులు, యువత

గుంటూరు రూరల్: వ్యవసాయ విస్తరణ, పరిశోధన, విద్య రంగాలలో 50 ఏళ్లుగా కృషి విజ్ఞాన కేంద్రాలు అందించిన సేవలు నిరుపమానమని లాంఫాం కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.యుగంధర్ కుమార్ కొనియాడారు. మంగళవారం నగర శివారుల్లోని లాంఫాంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో గోల్డెన్ జూబ్లీ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పద్ధతులను విప్లవాత్మకంగా మార్చటంలో, గ్రామీణ జీవనోపాధిని మెరుగు పరచటంలో, స్థిరమైన వ్యవసాయాన్ని ప్రోత్సహించటంలో కేవీకే సాధించిన విజయాలను వివరించారు. అనంతరం ఆదర్శ రైతులను, లబ్ధి పొందిన గ్రామీణ యువతను సన్మానించారు. భవిష్యత్తులోనూ వ్యవసాయ రంగంలో అద్భుత ఆవిష్కరణలకు కృషి విజ్ఞాన కేంద్రాలు విశేష కృషి చేస్తాయని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ ఎం. గంగాదేవి, శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.దీప, డాక్టర్ సీహెచ్ అనిల్‌కుమార్, డాక్టర్ ఆర్‌కే సౌజన్యలక్ష్మి, రైతులు, ఆదర్శ రైతులు గ్రామీణ యువతీ యువకులు తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌ల కంప్యూటీకరణ చేపడతాం

కలెక్టర్ నాగలక్ష్మి



వర్చువల్‌గా మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలోని ప్రైమరీ అగ్రికల్చరల్ క్రెడిట్ సొసైటీ (పీఏసీఎస్)ల కంప్యూటీకరణకు అవసరమైన చర్యలను నిబంధనలకు లోబడి తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి తెలిపారు. మంగళవారం విజయవాడలోని ఆప్కాబ్ కార్యాలయం నుంచి ఆప్కాబ్ చైర్మన్ ఎ బాబు నిర్వహించిన వీడియో సమావేశానికి కలెక్టర్ హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 167 పీఏసీఎస్‌ల కంప్యూటీకరణ సంబంధించి నమోదు చేసిన వివరాలను సేకరించామన్నారు. వీటిని పూర్తి స్థాయిలో పరిశీలించి అప్‌లోడ్ చేస్తామన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలతోపాటు ఇతర ఎంఎస్‌ఎమ్‌ఇలకు సంబంధించి మార్గదర్శకాలను అనుసరించి ప్రభుత్వ రుణాలు అందేలా చూస్తామని చెప్పారు. జనరల్‌బాడీ సమావేశం ద్వారా జిల్లా సహకార బ్యాంకుల్లో డిపాజిట్లు సేకరణ, ఇతర అంశాల అమలుకు అందిన సూచనల ఆధారంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వివరించారు. సమావేశంలో డీసీసీబీ సీఈఓ కృష్ణవేణి పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న జిల్లా ఎస్పీకి ఆత్మీయ వీడ్కోలు



ఎస్పీ తుషార్ డూడీని సత్కరిస్తున్న ఏఎస్పీలు, డీఎస్పీలు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): బాపట్ల జిల్లా ఎస్పీగా బదిలీపై వెళ్తున్న గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడీకి మంగళవారం జిల్లా పోలీస్ అధికార యంత్రాగం ఆత్మీయ వీడ్కోలు పలికింది. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఎస్పీల బదిలీల్లో జిల్లా ఎస్పీ తుషార్ డూడీ బాపట్ల జిల్లాకు బదిలీ అయిన విషయం విదితమే. ఈ మేరకు గుంటూరు నగరంపాలెం పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ కవాతు నిర్వహించారు. పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో ఎటువంటి అల్లర్లు, హింసాత్మక ఘటనలు లేకుండా ప్రశాంతంగా నిర్వహించడంలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించారని పలువురు పోలీస్ అధికారులు ప్రశంసించారు. జిల్లాలో శాంతిభద్రతలను పరిరక్షించి, జిల్లా ప్రజల మన్ననలు పొందారని కొనియాడారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ మాట్లాడుతూ పోలీస్ అధికార, సిబ్బందికి కేటాయించిన విధులు సమర్థవంతంగా నిర్వహించడం వల్లే జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని అన్నారు. అనంతరం ఆయనను పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీలు నిచికేట్ షెల్కే (గుంటూరు తూర్పు), జీవీ రమణమూర్తి (పరిపాలన), శ్రీనివాసరావు (క్రైం), శ్రీనివాసరావు (ఎల్/ఓ), ఎం.వెంకటేశ్వరరావు(సెబ్), హనుమంతరావు (ఏఆర్), డీఎస్పీలు శాంతకుమార్ (ఏఆర్), మహేష్ (గుంటూరు పశ్చిమ), మహబూబ్‌బాషా (దక్షిణ), టీవీరత్నస్వామి (ఎస్‌బీ), మల్లికార్జునరావు (ఎస్‌సి,ఎస్‌టి సెల్), సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికి కొత్తగా ఎన్నికైన కూటమి ప్రభుత్వం చొరవ చూపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు కోరారు. గుంటూరు బ్రాడీపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం గుంటూరు చానల్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. 50 గ్రామాలకు సాగునీరు, తాగునీరు సమస్యను పరిష్కరించే ఛానల్ పొడిగింపుకు నిధులు కేటాయించాలన్నారు. మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని పెదవడ్లపూడి హైలెవల్ ఛానల్‌ను పూర్తి చేసి 25వేల ఎకరాలకు నీరు అందించాలని కోరారు. మంగళగిరి నియోజకవర్గంలో 50 ఏళ్లుగా సుమారు 22వేల పేదకుటుంబాలు ప్రభుత్వ భూముల్లో ఇళ్లు వేసుకుని నివాసముంటున్నాయని చెప్పారు. రాజధాని సీడ్ యాక్సిస్ రోడ్డుకు భూములిచ్చిన రైతులకు ప్యాకేజిని పెంచాలని, రాజధాని నిర్మాణానికి భూములచ్చిన రైతులకు కౌలు చెల్లించే కాలపరిమితిని పెంచాలన్నారు. వ్యవసాయ కార్మికులు, ఇతర పేదలకు నెలకు 6వేలు పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. కౌలు రైతులకు యాజమాని సంతకంతో నిమిత్తం లేకుండా గుర్తింపు కార్డులిచ్చి పంట రుణాలు మంజూరు చేయాలని కోరారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు, అందుబాటులో ఉంచాలన్నారు. గుంటూరు ఛానల్, కొండవీటి వాగు, నల్లమడ, మేకల వాగు ఇతర పంట కాల్వల్లో తూటుకాడ, గుర్రపు డెక్క, ఇతర కంపచెట్లు పెరిగి నీటి ప్రవాహనికి అడ్డువచ్చి పంటలు మునిగిపోతున్నాయని వెంటనే నిధులు కేటాయించి కాల్వలు మరమ్మతు చేయాలని కోరారు. అంగన్‌వాడీ, ఆశా, మున్సిపల్ వర్కర్స్ వేతనాలు పెంచి సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు ఈమని అప్పారావు, కె.నళినికాంత్, కె.అజయ్‌కుమార్, బెర్రగాని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు జిల్లా ఎస్పీ బాధ్యతల స్వీకరణ

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు జిల్లా నూతన ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారని తెలిసింది. రాష్ట్ర వ్యాప్తంగా శనివారం జరిగిన ఐపీఎస్‌ల సాధారణ బదిలీల్లో భాగంగా కాకినాడ ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఆయనను గుంటూరు జిల్లాకు బదిలీ చేసిన విషయం విదితమే. తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఆయన 2016 ఐపీఎస్ బ్యాచ్. తొలుత చింతపల్లి ఏఎస్పీగా, నర్సీపట్నం ఏఎస్‌డీగా విధులు నిర్వర్తించి, ఎస్పీగా ఉద్యోగోన్నతి పొంది అల్లూరి సీతారామరాజు జిల్లా, కాకినాడ ఎస్పీగా చేశారు. ఈ క్రమంలో గుంటూరు జిల్లా ఎస్పీగా బదిలీయ్యారు.

ఉద్యోగ సంఘాలతో ప్రభుత్వం చర్చలు జరపాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు

చిలకలూరిపేట: కొత్త పెన్షన్ విధానంపై ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించాలని ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు కోరారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఎస్టీయూ కార్యవర్గ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కొత్త పెన్షన్ విధానం అమలుకు చర్యలు చేపడుతున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆ దిశగా చర్యలు చేపట్టాలన్నారు. పీఆర్‌సీ కమిటీ చైర్మన్ రాజీనామా చేసిన నేపథ్యంలో కొత్త చైర్మన్‌ను నియమించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీ బకాయిలు, డీఏ బకాయిలు చెల్లింపునకు తగు చర్యలు చేపట్టాలన్నారు. యాప్‌ల భారం తగ్గించి ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలన్నారు. సంఘ రాష్ట్ర పూర్వ కార్యదర్శి పోటు శ్రీనివాసరావు మాట్లాడుతూ సమగ్రశిక్షలో పనిచేస్తున్న వారికి నేటికీ జీతాలు చెల్లించకపోవడం బాధాకరమన్నారు. 20వేల మందికి పైగా ఉన్న సిబ్బంది కుటుంబాలు ఈ జీతాలపైనే ఆధారపడి ఉంటారన్న విషయాన్ని గుర్తించి ప్రభుత్వం వెంటనే జీతాలు అందించాలని కోరారు. సమావేశంలో సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి వినుకొండ అక్కయ్య, జిల్లా కౌన్సిలర్ షేక్ జమీర్‌బాష, నాయకులు చావలి మల్లేశ్వరరావు, మేకల కోటేశ్వరరావు, వడ్లాన జయప్రకాశ్ పాల్గొన్నారు.

వీపీ సౌత్ వైద్యశాలకు అత్యున్నత సేవల సర్టిఫికెట్



మాచర్ల రూరల్: మండల పరిధిలోని విజయపురిసౌత్ ప్రభుత్వ వైద్యశాలకు జాతీయ హామీ ప్రమాణాల పర్యవేక్షణ సంస్థ నుంచి అత్యున్నత సేవల సర్టిఫికెట్ వచ్చినట్లు డాక్టర్ ఓరుగంటి ప్రవీణ్ తెలిపారు. ఈ నెల 3వ తేదీన జాతీయ నాణ్యత ప్రమాణాల టీం కన్వీనర్ డాక్టర్ ఎంఏ అనూఫ్ నేతృత్వంలో జరిగిన వైద్యశాల పనితీరు తనిఖీలలో వారు సంతృప్తిని వ్యక్తం చేశారన్నారు. మంగళవారం నేషనల్ హెల్త్ రీసోర్స్ సెంటర్ నుంచి జాతీయ స్థాయిలో విజయపురిసౌత్ వైద్యశాలకు సర్టిఫికెట్‌ను అందించినట్లు పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో జరిగిన అసైన్‌మెంట్ 92.28 శాతంతో సర్టిఫికెట్ అందజేశారన్నారు. వెనుకబడిన పల్నాడు ప్రాంతంలో అత్యున్నత సేవలందిస్తున్న జిల్లా వైద్యాధికారి రంగారావు వైద్యులు ప్రవీణ్, ముక్తీయార్, జాని, సూపరింటెండెంట్లు చారి, పద్మావతి, సంధ్యాకుమారి, సుజాతలను అభినందించారు.

బడ్జెట్‌లో చేనేతలకు రూ.2 వేల కోట్లు కేటాయించాలి

తాడేపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులను ఆదుకునేందుకు రాష్ట్ర బడ్జెట్‌లో 2 వేల కోట్ల రూపాయలు కేటాయించాలని కోరుతూ రాష్ట్ర చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లల మర్రి బాలకృష్ణ మంగళవారం తాడేపల్లి రూరల్ కుంచనపల్లిలోని చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్.సవితను ఆమె కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. బాలకృష్ణ మాట్లాడుతూ వ్యవసాయ రంగం తరువాత చేనేత వృత్తికి ఎంతో ప్రాధాన్యం ఉందని, ప్రస్తుతం చేనేత పరిశ్రమ కార్పొరేట్ విధానాల వలన సంక్షోభంలో చిక్కుకుందని, తద్వారా చేనేత కార్మికులు ఆకలి చావులకు గురవుతున్నారని, అప్పులు తాళలేక ఆత్మహత్యలు చేసుకుని బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం చేనేతలపై జీఎస్టీ విధించడం వల్ల చేనేత రంగం కకావికలమైందని విమర్శించారు. రాష్ట్ర బడ్జెట్‌లో చేనేత కార్మికులను ఆదుకునేందుకు 2 వేల కోట్ల రూపాయలు కేటాయించాలని కోరారు. ప్రతి చేనేత కార్మికుడికీ మూడు సెంట్ల స్థలంలో షెడ్‌తో కూడిన ఇల్లు నిర్మించి ఇవ్వాలని, పట్టు జరీ నూలును 2021 నాటి ధరలకు తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. చేనేత వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరామని, తమ సంఘం డిమాండ్లపై మంత్రి సవిత సానుకూలంగా స్పందించారని వివరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కట్టా శివ దుర్గారావు, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డోకిపర్తి రామారావు, కమిటీ సభ్యులు కొతరపు వెంకటేశ్వరరావు, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలుగు ఉపాధ్యాయుడు డీఈఓకు సరెండర్



పాఠశాలలో విచారిస్తున్న డీవైఈఓ శాంతకుమారి, ఎంఈవో లక్ష్మీనారాయణ

తెనాలిరూరల్: తెనాలి మండలం పెదరావూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు నాగేశ్వరరావుపై విద్యార్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకున్నారు. ఉపాధ్యాయుడిని డీఈఓకు సరెండర్ చేశారు. తెలుగు ఉపాధ్యాయుడు నాగేశ్వరరావు పాఠాలు సరిగా చెప్పడం లేదని పలువురు విద్యార్థినులు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఈ మేరకు తెనాలి జిల్లా ఉప విద్యాధికారిణి శాంతకుమారి, ఎంఈఓ మేకల లక్ష్మీనారాయణ పాఠశాలలో మంగళవారం విచారణ చేపట్టారు. ఉపాధ్యాయుడిని బదిలీ చేయాల్సిందేనని విద్యార్థినులు పట్టుబట్టారు. దీంతో స్పందించిన అధికారులు నాగేశ్వరరావును జిల్లా విద్యా శాఖధికారి కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశించారు. పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులలో ఒకరిని తెలుగు బోధించేందుకు సర్దుబాటు చేశారు. విద్యార్థులు సమస్యను దృష్టికి తెచ్చిన వెంటనే సరిగా స్పందించని ప్రధానోపాధ్యాయురాలు సరళను మందలించారు.

గుంటూరు చానల్‌ను పర్చూరు వరకు పొడిగించాలి

డాక్టరు కొల్లా



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు డాక్టరు కొల్లా

బాపట్ల: గుంటూరు చానల్‌ను పర్చూరు వరకు పొడిగించాలని నల్లమడ రైతు సంఘం నాయకుడు డాక్టరు కొల్లా రాజమోహనరావు కోరారు. బాపట్ల మండలంలోని చెరువు జమ్ములపాలెంలోని రామాలయంలో మంగళవారం రైతుల సమావేశం నిర్వహించారు. డాక్టరు కొల్లా మాట్లాడుతూ గుంటూరు చానల్ కోసం ఎంతో కాలంగా పెదనందిపాడు, పర్చూరు ప్రాంత రైతులు ఆందోళన చేస్తున్నారని చెప్పారు. నల్లమడ డ్రెయిన్ ఆధునికీకరణ పనులు చేపట్టాలని సూచించారు. సమావేశంలో మాట్లాడుతూ జమ్ములపాలెం అధ్యక్షులు కాపు వెంకట కమలాకరరావు, విజయకుమార్, మానం విజేత, వైపె చౌదరి, కామేపల్లి కృషిబాబు, జిల్లెళ్లమూడి సర్పంచి గండికోట సుబ్బయ్య, పువ్వాడ బసంత్‌కుమార్, పంగులూరి శ్రీనివాసరావు ఉన్నారు.